PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :142 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం. 07.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS

## కోహెడ అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ ..

# తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ

### రైతుల ఆదాయ వృద్ధి, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులే ప్రభుత్వ లక్ష్యం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు: శనివారం సాయంత్రం కోహెడ లో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి,ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టార్ ఆఫీస్ కాంప్లెక్స్ కు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ లు వేం నరేందర్ రెడ్డి,చామల కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు,శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ లు మల్ రెడ్డి రంగా రెడ్డి , వీర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్ ,కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయ, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు , తదితరులు పాల్గొన్నారు.రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంతో పాటు రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గతంలో రైతులు పండించిన పండ్లు, కూరగాయలు, పాలు హైదరాబాద్ నగర ప్రజల అవసరాలను తీర్చేవని, అయితే పట్టణీకరణ మరియు రియల్ ఎస్టేట్ విస్తరణ కారణంగా వ్యవసాయ భూముల విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం కోటి ముప్పై లక్షలకు పైగా జనాభా కలిగిన హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆహార అవసరాలను తీర్చేందుకు ఆధునిక వ్యవసాయ మౌలిక వసతులు అవసరమని తెలిపారు.గతంలో తాత్కాలిక షెడ్లలో నిర్వహించిన మార్కెట్‌లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తూ, రైతులకు భద్రతతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు 240 ఎకరాల్లో ఆధునిక ఫ్రూట్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత కోహెడ ఫ్రూట్ మార్కెట్ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో పండ్లు, కూరగాయల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని, కందుకూరు ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే టమోటా ఆధారంగా సాస్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రైతులకు మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మారుస్తామని తెలిపారు.ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నామని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థలను అక్కడకు ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే రీజనల్ రింగ్ రోడ్, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, వరంగల్ మరియు ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవుటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత ఆధునిక కార్యాలయ సముదాయాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం వస్తోందని, ఆ ఆదాయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి నమోదైందని చెప్పారు.సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా రాష్ట్రంలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ, మహిళలకు వడ్డీ రాయితీతో బ్యాంకు లింకేజ్ రుణాలు, మహిళల ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని, తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అన్నారు.

---

## భూ దందాను.. అడ్డుకుంటాం

హైదరాబాద్, రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు

### లక్షల కోట్ల విలువైన భూమి స్వాహా

- సీఎం కుటుంబ సభ్యులతో సహా ప్రజాప్రతినిధులు బాగస్తులు
- పేరుకే రేవంత్ రెడ్డి పాలన.. నడుస్తుంది కేటీఆర్ పాలనే
- కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డ కవిత

₹లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు.

### నడుస్తుంది కేటీఆర్ పాలనే..

సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్ మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని కవిత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు.



### పవన్ కొన్నది శిఖం భూమే..

తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కు మద్దతిస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

---

## ఆ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.. మంత్రి సీతక్క వార్నింగ్



హైదరాబాద్,రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## మలేషియా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలి: శ్రీధర్ బాబు

హైదరాబాద్,రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడుతుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరిక..

### సీఎస్ కీలక ఆదేశాలు



హైదరాబాద్, రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడుతెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి..**

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

## ఇసుక అక్రమ రవాణాపై మంత్రి వివేక్ సీరియస్..



హైదరాబాద్, రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు ఇసుక ఆదాయం పెంపుపై టీజీఎం డీసీ అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై మంత్రి వివేక్ వెంకటస్వామి సీరియస్ అయ్యారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లారీల కదలికలపై 24ఇ7 పర్యవేక్షించాలని హుకుం జారీ చేశారు. ఇసుక నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని దిశానిర్దేశం చేశారు. అలాగే, సాండ్ బజార్ల పనితీరుపై మంత్రి వివేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కీలక ఖనిజాల అన్వేషణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖనిజ వనరుల సమర్థ నిర్వహణకు అమలు చేసే వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు.

# ఎకో టౌన్‌కు వ్యతిరేకంగా సీఎం సభలో సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్ –రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కోహెడలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమంలో నిరసన ఘటన చోటు చేసుకుంది. చిన్న రావిరాల గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ తన గ్రామ పరిధిలో ప్రతిపాదిత ఎకో టౌన్ (డంపింగ్ యార్డ్) ఏర్పాటు వద్దు అంటూ ఫ్లకార్డు ప్రదర్శించి నిరసన తెలిపారు. చిన్న రావిరాల, బండ రావిరాల గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 268లో ఎకో టౌన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, దీనివల్ల స్థానిక ప్రజలు, రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న బహిరంగ సభలోనే ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. "మా విలేజ్‌లో ఎకో టౌన్ వద్దు" అనే సందేశంతో ఫ్లకార్డు ప్రదర్శించిన సర్పంచ్, స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఘటన సభకు హాజరైన వారిలో చర్చనీయాంశంగా మారింది. ప్రతిపాదిత ఎకో టౌన్‌పై గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులతో సైబరాబాద్ సీపీ సమావేశం

## విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, సాంకేతిక పర్యవేక్షణకు ప్రాధాన్యం

## స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలుపై విస్తృత చర్చ





సైబరాబాద్ కమిషనరేట్ రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు విద్యార్థుల రవాణాను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన "స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్" అమలుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ శనివారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు, విద్యాసంస్థల రవాణా నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను తరలించే ప్రతి వాహనంలో సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ఆధారిత రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థలు, అత్యవసర భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే డ్రైవర్ల అర్హతలు, లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, నిర్వహణ ప్రమాణాలపై కఠిన పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. సమావేశంలో స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌పై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పర్యవేక్షణ, విద్యార్థులకు అందుబాటు ధరల్లో రవాణా సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని అధికారులు వివరించారు. ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్న మొబైల్ అప్లికేషన్ ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణిస్తున్న వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని సీపీ తెలిపారు. వాహనంలో విద్యార్థుల సంఖ్య, డ్రైవర్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్ స్థితి, వాహనం ఫిట్‌నెస్, ప్రయాణ మార్గం, ప్రస్తుత లొకేషన్ వంటి సమాచారం యాప్‌లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. అదేవిధంగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా విద్యార్థుల రవాణా వాహనాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే అవకాశంతో పాటు విద్యార్థుల భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల పికప్, డ్రాపింగ్ సేవలు, పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, క్రీడా శిక్షణా కేంద్రాలకు వెళ్లే సమయంలో ఎదురయ్యే రవాణా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ కార్యక్రమం విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులు ట్రాఫిక్ నిర్వహణ, ఆర్టీఓ అనుమతులు, లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను సీపీ దృష్టికి తీసుకువెళ్లగా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సాధ్యమైన పరిష్కారాలు అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో శేరిలింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ శీతల్ సోహన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్

## మసీదు భూమి సర్వే రిపోర్టు పంపేందుకు డబ్బులు డిమాండ్ చేసిన మహమూద్



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు: మసీదు భూమికి సంబంధించిన సర్వే రిపోర్టును ఉన్నతాధికారులకు పంపేందుకు రూ.10 వేల లంచం డిమాండ్ చేసిన వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహమూద్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, నల్గొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని 900 గజాల స్థలంలో ఉన్న మసీదు మరియు ఖాళీ స్థలానికి సంబంధించిన వివాదంపై స్థానిక మసీదు కమిటీ ప్రతినిధులు 2025 ఫిబ్రవరిలో వక్ఫ్ బోర్డు సీఈవోకు వినతిపత్రం సమర్పించారు. సంబంధిత స్థలాన్ని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. దీంతో వక్ఫ్ బోర్డు సీఈవో ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ మహమూద్, సర్వేయర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు. సర్వే ప్రక్రియ పూర్తయినప్పటికీ, సంబంధిత నివేదికను సీఈవో కార్యాలయానికి పంపకుండా నిలిపివేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిపోర్టును పంపాలంటే రూ.10 వేల లంచం ఇవ్వాలని ఇన్స్పెక్టర్ మహమూద్ బాధితుడిని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో విసిగిపోయిన మసీదు కమిటీ ప్రతినిధులు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మిర్యాలగూడ బస్టాండ్ ప్రాంతంలో ఉచ్చుపన్ని, రూ.10 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో ఇన్స్పెక్టర్ మహమూద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అధికారులు నల్గొండలోని వక్ఫ్ కార్యాలయంలో సోదాలు నిర్వహించగా, మిర్యాలగూడలోని ఇన్స్పెక్టర్ నివాసంలో కూడా ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. కేసుకు సంబంధించిన పలు కీలక పత్రాలు, ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర మాట్లాడుతూ, ప్రాథమిక విచారణ అనంతరం సేకరించిన సాక్ష్యాధారాలతో నిందితుడిని నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా అధికారి లేదా ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు వెంటనే ఏసీబీని సంప్రదించాలని సూచించారు. ఈ ఘటన వక్ఫ్ భూముల వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలకు మరో ఉదాహరణగా నిలిచింది. ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు లంచాలు చెల్లించాల్సిన పరిస్థితులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# రైతన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ కి వినతి

## పెంచిన ఎరువులు ధరల తగ్గించాలి. (ఏఐయుకేఎస్)



సింగరేణి జూన్ 6 రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడుఅఖిలభారత ఐక్య రైతు సంఘం ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూన్ 6న సింగరేణి మండల డిప్యూటీ తహసిల్దార్ కి సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ 2026 వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రాష్ట్రంలో ఎల్ ని నో ప్రభావంతో ఏ ఏ ప్రాంతాలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయో వాతావరణ శాఖ ప్రకటించింది. వ్యవసాయానికి మూలం విత్తనం లేనిదే వ్యవసాయం లేదు. వ్యవసాయ ఆధారిత ఆయా ప్రాంతాలకు రైతాంగానికి సరిపడినన్ని పూర్తి సబ్సిడీపై ఏ ఏ విత్తనాలు అవసరాన్ని బట్టి ఇవ్వాలి. రాష్ట్రంలో 7.46 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా కేవలం 1.62 లక్షల క్వింటాళ్లు సబ్సిడీపై సరఫరా చేస్తుంది. హైబ్రిడ్ జొన్న, మొక్కజొన్న 75 % చిరుధాన్యాలు 50% పప్పు ధాన్యాలు 30% సెనగ 25 % వేరుశెనగ, నువ్వులు 40 % మినుము, కందులు, సబ్సిడీ పై అందించాల్సి ఉండగా పూర్తిస్థాయిలో అందడం లేదు. ఏజెన్సీ ప్రాంతాలలో 90 % సబ్సిడీపై ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ కారేపల్లి, కామేపల్లి మండలాల్లో రైతులందరికీ సబ్సిడీపై ఇవ్వడానికి అనేక అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలని ఏ యు కె ఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యులు పుల్లకాని సత్తిరెడ్డి, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వడ్డే వెంకటేశ్వర్లు, అఖిల భారత ఐక్య రైతు మండల కమిటీ సభ్యులు బాల్ బి బాలు నాయక్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# చెర్లగౌరారంలో ఘనంగా బాల పంచాయతీ

## పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించడమే లక్ష్యం

రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు






నల్లగొండ జిల్లా కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బాల పంచాయతీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ "అభిలాషా బిష్త్", నల్లగొండ జిల్లా కలెక్టర్, "చంద్రశేఖర్", జిల్లా ఎస్పీ, "శరత్ చంద్ర పవార్", ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా బాల పంచాయతీలో పాల్గొన్న విద్యార్థులు పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, బాలల భద్రత, విద్యా ప్రమాణాలు, గ్రామాభివృద్ధి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరిచారు. పిల్లలు తమ సమస్యలను, సూచనలను అధికారుల ముందుంచి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అభిలాషా బిష్త్ మాట్లాడుతూ, "పిల్లలే దేశ భవిష్యత్తు. వారి ఆలోచనలు, అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చు" అని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో కుటుంబ సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచే పిల్లలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. బాలల అభిప్రాయాలను గౌరవించి వారి భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, బాలల భద్రత, విద్య, మానసిక వికాసం కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. బాలలపై జరిగే నేరాల నివారణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యంగిస్థాన్ ఎన్జీఓ, ఆశ్రిత ఎన్జీఓ ప్రతినిధులు బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సురక్షిత బాల్యం, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. బాలల సాధికారతకు చెర్లగౌరారం గ్రామం వేదికగా నిలిచిన ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, ఎంపీడీఓ వేద రక్షిత, సీఐలు ఆది రెడ్డి, రాము, కరుణాకర్, ఎస్ఐలు అంజలి, రాజీవ్ రెడ్డి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీఈఓ సుశీందర్ రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 50 వేల మంది నిరాశ్రయులకు డబుల్ బెడ్ రూమ్ లను ఇవ్వాలని కోరుతూ కీసర మున్సిపాలిటీ ముందు పిఆర్ పీఎస్ ధర్నా

రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ల కోసం 70 వేల మంది అప్లై చేసుకోగా, అందులో 60 వేల మంది గణనీయమైన సంఖ్యలో అర్హులే, ప్రస్తుతం నిర్మాణం అయి ఉన్నవి కేవలం 6,500 మాత్రమే, ఈ స్థితిలో తప్పనిసరిగా 50 వేల డబుల్ బెడ్ రూమ్ లను నూతనంగా నిర్మించి ఇవ్వాల్సిన ఆవశ్యకథ ఉండగా, మాన్యులు రెవిన్యూ, హౌజింగ్ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గోరంత చేస్తూ... ఆకాషాన్ని తాకే కొండంత మాటలు చెబుతున్నారని, ముందు పేదల కలల సకారాన్ని నెరవేర్చకనే కెసిఆర్ ప్రభుత్వం మట్టికరిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆవిధంగా చేస్తే తాను మట్టికరుస్తుందని" ప్రజా పోరాట సమితి (పిఆర్ పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకట్ స్వామి అన్నారు. ఈరోజు కీసర మున్సిపాలిటీ ఆఫీసు ముందు పిఆర్ పీఎస్ ఆధ్వర్యంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలతో ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిప్యుటీ కమీషనర్ నర్రా వసంత కు మెమోరాండం అందజేశారు. ఈరోజు ధర్నాలో పిఆర్ పీఎస్ జిల్లా నాయకులు గుండెల్లి మల్లేష్, మంగపురం సురేష్, ఉప్పతల దేవి, గౌని రాజేష్, ఉబ్బని లత, పల్లపు మంజుల, దండుగుల శివాని తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ న్యూ శాయంపేటలో అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు: న్యూ శాయంపేటలోని స్వయంభు శ్రీ తివేదాద్రి సంతోష లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రతి శనివారం నిర్వహించే గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఈరోజు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గిరి ప్రదక్షిణ నిర్వహించి, అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజనాలతో కిటకిటలాడగా, భక్తులు "జై లక్ష్మీనరసింహ స్వామి" నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ అమరేందర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సంక్షేమం కోసం ఆమె ఆకాంక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేయగా, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలక పాత్ర: ఎంపీ డాక్టర్ కడియం కావ్య







రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు: స్టేషన్ ఘనపూర్, జూన్ 6: ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) పాత్ర అత్యంత కీలకమని, ప్రతి బీఎల్ఏ పార్టీకి సైనికుడిలా పనిచేస్తూ ప్రతి ఓటును కాపాడాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం కేవలం ప్రచారంతో కాకుండా, పటిష్టమైన ఓటర్ల జాబితా నిర్మాణంతోనే సాధ్యమవుతుందని ఆమె అన్నారు. రఘునాథ్‌పల్లి మండలం నిడిగొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బూత్ స్థాయి నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ముఖ్యంగా బీజేపీ ఓటర్ల జాబితాల విషయంలో అనుసరిస్తున్న విధానం ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు. ప్రజల మద్దతుతో గెలవలేని పరిస్థితుల్లో ఓటర్ల జాబితాల్లో మార్పులు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అది ఎలాంటి కారణాలతోనూ కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఓటు చోరీ ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి బూత్ అధ్యక్షుడు, బీఎల్ఏ, కాంగ్రెస్ కార్యకర్త ఓటు హక్కు పరిరక్షణ కోసం క్షేత్ర స్థాయిలో యోధుడిలా పనిచేయాలని సూచించారు. వచ్చే మూడు నెలల పాటు ఇంటింటికీ వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించాలని, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, తొలగించబడిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి బూత్‌లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్న ఎంపీ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించే బాధ్యత కూడా బూత్ ఏజెంట్లపైనే ఉందన్నారు. అనంతరం డాక్టర్ కడియం కావ్య రూపొందించిన 'బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్' ను ఆవిష్కరించి బీఎల్ఏలు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నియోజకవర్గ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీనివాస్, ట్రైనర్ పి. రాజశేఖరరెడ్డి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపాలిటీ ఛైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ వంగరి సత్తయ్యకు ఘన నివాళి

## సంతాప సభలో చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి









రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు, జూన్ 6: చర్లపల్లి మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ వంగరి సత్తయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం నల్గొండ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన కామ్రేడ్ వంగరి సత్తయ్య సంతాప సభలో వారు మాట్లాడారు. జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి, ఎర్రజెండాను వీడకుండా ప్రజల కోసం పోరాడిన నాయకుడిగా వంగరి సత్తయ్య నిలిచారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాల్లో అవకాశవాదం పెరిగిపోతున్న తరుణంలో తన ఆశయాలకు కట్టుబడి చివరి శ్వాస వరకు ప్రజల మధ్యే జీవించిన వ్యక్తిగా ఆయనను గుర్తుచేశారు. సర్పంచిగా, ఎంపీటీసీగా గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని, గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం, భూమిలేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయించడం, గృహ నిర్మాణానికి సహకరించడం వంటి కార్యక్రమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దోపిడీ లేని సమసమాజ నిర్మాణమే ఆయన ఆశయమని, ఆ మార్గంలో ప్రజలంతా నడవాలని పిలుపునిచ్చారు. వంగరి సత్తయ్య సతీమణి పార్వతమ్మ కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆతిథ్యమిచ్చే గొప్ప మనసున్న వ్యక్తిగా నిలిచారని, ఆయన కుమారుడు వంగరి రమేష్ తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సభ ప్రారంభానికి ముందు నాయకులు వంగరి సత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి విప్లవ జోహార్లు సమర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాషం, జిల్లా సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, కార్పొరేటర్ దొడ్డి రమేష్, ఎల్పీటీ మార్కెట్ ఛైర్మన్ జిల్లా బిక్షం, మాజీ జడ్పీటీసీ నామిని గోపాల్, చర్లపల్లి సీపీఎం శాఖ కార్యదర్శి పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాపోలు జయలక్ష్మి–రవీందర్, మాజీ సర్పంచ్ ఎన్న నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యం

### నల్గొండలో రెండో విడత వార్డు సభలు విజయవంతం



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెండో విడత వార్డు సభలు శనివారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. డివిజన్ నెంబర్లు 13, 14, 15, 16, 17, 21, 22, 23, 24, 44, 45, 46లలో జరిగిన ఈ సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర డివిజన్ 15, 16 వార్డు సభల్లో పాల్గొని ప్రజలతో నేరుగా మాట్లాడారు. ప్రజల అవసరాలు, సమస్యలను



వార్డు స్థాయిలో గుర్తించి వేగంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026 ప్రకారం చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు. అలాగే జల్ సంచయ్–జల్ భాగీధారి కార్యక్రమం కింద వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో డ్రైనేజీల పూడికతీత, మురుగు కాలువల శుభ్రత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టడం, పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. సభల్లో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు, రహదారులు, వర్షపు నీటి పారుదల, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలు వినతులు, ఫిర్యాదులు సమర్పించారు. అందిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పోచంపల్లి థ్రెడ్ ఎగ్జిబిషన్‌కు గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరు

రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడుమాదాపూర్‌లోని హైటెక్స్ హాల్–4లో నిర్వహిస్తున్న "పోచంపల్లి థ్రెడ్" ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి, వర్తకులు, చేనేత కళాకారులతో ముచ్చటించి వారి సమస్యలు, ఉత్పత్తుల విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు, ఖ్యాతి ఉందని అన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఢిల్లీలో సహచర ఎంపీలు, కేంద్ర మంత్రులకు పోచంపల్లి శాలువాలను కప్పి, భూదాన్ పోచంపల్లి చేనేత వస్త్రాల గొప్పతనాన్ని వివరించేవాడినని గుర్తుచేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం తాను ఎప్పటికప్పుడు కృషి చేశానని తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు హైటెక్స్‌లో జరుగుతున్న ఈ వస్త్ర ప్రదర్శనను సందర్శించి, నాణ్యమైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత రంగానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.








## చరణ్ 'పెద్ది' లెక్కలు.. పవన్, బన్నీ, తారక్ రికార్డులు బ్రేక్..

అ విజయానికి సినిమా బ్యాక్ డ్రాప్ కూడా ఒక మెయిన్ రీజన్ గా కనిపిస్తోంది. ఎందుకంటే పెద్ది కథ 1980ల నాటి కోస్తాంధ్ర విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగుతుంది.మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన పెద్ది మూవీ బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి



దూసుకుపోతోంది. ఇప్పుడు రెండో రోజు కూడా అదే స్పీడ్ ను కంటిన్యూ చేస్తూ పలు రికార్డులను బ్రేక్ చేసినట్లు సమాచారం. ముఖ్యంగా కోస్తాంధ్రలోని ఆరు మెయిన్ ఏరియాల్లో పెద్ది రెండో రోజు వసూళ్లు ఇటీవల విడుదలైన పలువురు స్టార్ హీరోల సినిమాల కంటే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప-2, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ దేవర చిత్రాల రెండో రోజు వసూళ్లను పెద్ది బ్రేక్ చేసినట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కోస్తాంధ్రలో పెద్ది సినిమా లెక్కలు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ మూవీ రేంజ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో చరణ్ కెరీర్ లోనే కాకుండా ఇటీవలి కాలంలో విడుదలైన భారీ చిత్రాల లిస్ట్ లో పెద్ది సినిమా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోందని అభిప్రాయాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అ విజయానికి సినిమా బ్యాక్ డ్రాప్ కూడా ఒక మెయిన్ రీజన్ గా కనిపిస్తోంది. ఎందుకంటే పెద్ది కథ 1980ల నాటి కోస్తాంధ్ర విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగుతుంది. ఆ ప్రాంత కల్చర్, లైఫ్ స్టైల్, లోకల్ ఎమోషన్స్ ను బుచ్చిబాబు స్క్రీన్ పై చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా కోస్తాంధ్ర ప్రేక్షకులు సినిమాతో మరింతగా కనెక్ట్ కావడానికి ఇదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమాలో రామ్ చరణ్ పెద్ది పెహల్వాన్ పాత్రలో కనిపించగా, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ అచ్చియమ్మగా నటించారు. కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ గౌర్నాయుడు పాత్రలో కీలకంగా కనిపించారు. అలాగే దివ్యేందు శర్మ, జగపతి బాబు, బొమన్ ఇరానీ, వీజీ చంద్రశేఖర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. స్పెషల్ సాంగ్ లో స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ ఆకట్టుకున్నారు.

## మృణాల్.. ప్లాన్ మార్చాల్సిందేనా?



టాలీవుడ్ లో మృణాల్ కు ఇప్పటికీ మంచి క్రేజ్ ఉంది. ప్రేక్షకులు కూడా ఆమెను కంటెంట్ కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనే ఎక్కువగా చూడాలని కోరుకుంటున్నారు.టీవీ యాక్ట్రెస్ గా కెరీర్ ప్రారంభించి, ప్రస్తుతం బాలీవుడ్ తోపాటు టాలీవుడ్ లోనూ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు పొందిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. అందానికి, అభినయానికి ఈక్వెల్ ఇంపార్టెన్స్ ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె.. ఇప్పుడు సినిమాల సెలెక్షన్ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే మృణాల్ 2014లో మరాఠీ చిత్రం విట్టి దండుతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. అనంతరం 2018లో విడుదలైన లవ్ సోనియా చిత్రంలో ప్రధాన పాత్ర పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత సూపర్ 30, బాట్లా హౌస్, తూఫాన్, జెర్సీ, ధమాకా, పిప్పా వంటి చిత్రాలతో బాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కానీ మృణాల్ కు అసలైన స్టార్ డమ్ ను తీసుకొచ్చింది టాలీవుడ్ నే అని చెప్పాలి. 2022లో విడుదలైన సీతారామంలో సీతామహాలక్ష్మి పాత్రలో ఆమె యాక్టింగ్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఆ చిత్రం భారీ విజయాన్ని సాధించడంతో తెలుగు ప్రేక్షకులకు మృణాల్ ఎంతో దగ్గరయ్యారు. అనంతరం నాని హీరోగా వచ్చిన హాయ్ నాన్నలో కూడా తన పాత్రలో మెప్పించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఆ రెండు చిత్రాల విజయాలతో మృణాల్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలు చేస్తారనే అభిప్రాయం కూడా బలపడింది. అయితే ఆ తర్వాత వచ్చిన కొన్ని ప్రాజెక్టులు మాత్రం ఆ స్థాయి ప్రభావం చూపలేకపోయాయి. ముఖ్యంగా ఫ్యామిలీ స్టార్ సహా పలు సినిమాలు ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయింది. అయినప్పటికీ మృణాల్ కు అవకాశాలు మాత్రం తగ్గలేదు.ఇటీవల వరుణ్ ధావన్, పూజా హెగ్డేతో కలిసి నటించిన హై జవానీ తో ఇష్క్ హోనా హై విడుదలైంది. ఆ చిత్రంలో మృణాల్ స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, నటనకు మంచి మార్కులు వచ్చినప్పటికీ సినిమా కథ విషయంలో మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. ఓల్డేజ్ కామెడీ, వీక్ స్టోరీ కారణంగా సినిమా ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రస్తుతం మృణాల్ సినిమా సెలెక్షన్ పై చర్చ మొదలైంది. నటిగా ఆమె టాలెంట్ పై ఎలాంటి డౌట్స్ లేవని, కానీ సరైన కథలు ఎంచుకోవడం మాత్రం చాలా కీలకమని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం హీరోయిన్ల మధ్య పోటీ ఉన్న సమయంలో కేవలం స్టార్ హీరోలు లేదా భారీ నిర్మాణ సంస్థలపై ఆధారపడకుండా, కంటెంట్ ను కూడా పరిశీలించాలని సూచిస్తున్నారు. టాలీవుడ్ లో మృణాల్ కు ఇప్పటికీ మంచి క్రేజ్ ఉంది. ప్రేక్షకులు కూడా ఆమెను కంటెంట్ కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనే ఎక్కువగా చూడాలని కోరుకుంటున్నారు.

## గ్లామర్ రోల్స్.. అసలు జాన్వీ ఒపీనియన్ ఏంటి?



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ టాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటున్నప్పటికీ, ఆమె చేస్తున్న పాత్రలపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ సాగుతోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ టాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటున్నప్పటికీ, ఆమె చేస్తున్న పాత్రలపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ సాగుతోంది. స్టార్ హీరోల సరసన నటిస్తున్నా, తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకునే రేంజ్ లో రోల్స్ మాత్రం రావడం లేదని కొందరు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. రీసెంట్ గా రిలీజైన పెద్ది చిత్రంలో జాన్వీ పోషించిన అచ్చియమ్మ పాత్రపై మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. నిజానికి రామ్ చరణ్ తో ఆమె జోడీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు స్ట్రాంగ్ రోల్ ఇచ్చి ఉంటారని అభిమానులు భావించారు. అయితే సినిమా విడుదలైన తర్వాత, జాన్వీ పాత్రకు కథలో పెద్దగా ప్రాధాన్యం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఆమెను ఎక్కువగా గ్లామర్ యాంగిల్ లోనే చూపించారని సోషల్ మీడియాలో పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఇది మొదటిసారి కాదని నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. టాలీవుడ్ లో ఆమె తొలి చిత్రం దేవరలోనూ జాన్వీ పాత్ర లిమిటెడ్ గా ఉందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. తంగం పాత్రలో కనిపించిన ఆమెకు కథలో చెప్పుకోదగ్గ స్కోప్ లేకపోవడం, కొన్ని సీన్స్, పాటలకు మాత్రమే పరిమితం కావడం అప్పట్లోనూ చర్చనీయాంశమైంది. దీంతో తెలుగులో ఇప్పటివరకు చేసిన రెండు సినిమాల్లోనూ యాక్టింగ్ కు అవకాశమున్న పాత్రలు దక్కలేదనే అభిప్రాయం ఫ్యాన్స్ లో వ్యక్తమవుతోంది. స్ట్రాంగ్ రోల్స్ దక్కితే ఆమెలోని అసలు టాలెంట్ బయటపడుతుందనే భావన వినిపిస్తోంది. అదే సమయంలో జాన్వీ కపూర్ కు సంబంధించిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో ఫుల్ గా వైరల్ అవుతోంది. ఆ వీడియోలో స్క్రీన్ పై తనను ఎలా ప్రెజెంట్ చేయాలనేది దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ దే నిర్ణయమని ఆమె చెప్పినట్లు కనిపిస్తోంది. "డైరెక్టర్ లేదా డీవోపీ కెమెరాను ఎలా ఉపయోగించాలనుకుంటారనేది వారిదే ప్లాన్. ఒక రోల్ లో ఎలా చూపించాలనేది కూడా వారి నిర్ణయమే" అనే ఆమె చెప్పినట్టు వీడియోలో వినిపిస్తోంది. అలాగే తనపై ఇప్పటికే గ్లామర్ డాల్ తరహా ఇమేజ్ ఏర్పడిందని, అందువల్ల చాలామంది మేకర్స్ కూడా అదే యాంగిల్ లో తనను చూపించాలని భావిస్తారని జాన్వీ పేర్కొన్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే ఒక నటిగా ప్రతి విషయంపై తాను నిర్ణయం తీసుకునే స్థితిలో ఉండనని, క్యారెక్టరైజేషన్ లో మేకర్స్ ఆలోచనే మెయిన్ గా వర్క్ చేస్తుందంటూ ఆమె చేసిన కామెంట్స్ మళ్లీ చర్చకు దారితీశాయి. ఏదేమైనా ఇప్పుడు జాన్వీ కామెంట్స్, ఆమె పోషించిన రోల్స్ రెండూ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

## రామ్ క్రేజీ థ్రిల్లర్ కోసం 'క్రిష్ 3' సినిమాటోగ్రాఫర్!



మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా అలానే తన దర్శకత్వంలో మొదటి సినిమాగా తన కెరీర్ 23వ సినిమాగా చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక క్రేజీ థ్రిల్లర్ గా రామ్ పోతినేని తన సినిమాని షేప్ అవుట్ చేసుకోగా అభిమానులు ఓ రేంజ్ లో సినిమా కోసం ఎదురు చూస్తున్నారు.ఇక ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ ని తాను అందించాడు. ఈ చిత్రానికి పలు పాపులర్ సినిమాలు క్రిష్ 3, ఆచార్య, గేమ్ ఛేంజర్ లాంటి భారీ సినిమాలకి కెమెరా వర్క్ అందించిన పాపులర్ సినిమాటోగ్రాఫర్ తిరు సాలిడ్ విజువల్స్ ని అందించనున్నారని సాలిడ్ అప్డేట్ ని ఇప్పుడు అందించాడు.దీనితో పాటుగా తనతో వర్క్ విషయంలో రామ్ పోతినేని తన ఎగ్జైట్మెంట్ ని తెలిపాడు. సో ఈ సినిమాకి తన వర్క్ ఎలా ఉంటుందో చూడాల్సిందే. ఇక ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి ఇతర వివరాలు ముమ్ముందు రానున్నాయి. అలాగే ఈ సినిమాని రామ్ పోతినేని సోదరుడు కృష్ణ పోతినేని నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## 'డ్రాగన్' అసలు ట్రీట్ కోసం అప్పటి వరకు ఆగాల్సిందేనా!



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే 'డ్రాగన్'. సెన్సేషనల్ మాస్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రీసెంట్ గా వచ్చిన గ్లింప్స్ తో క్రేజీ ట్రీట్ ని ఇచ్చింది. అక్కడ నుంచి మరిన్ని అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమాలో తారక్ లుక్ కూడా రివీల్ అయ్యి దీనికి మాస్ రెస్పాన్స్ వచ్చింది.అయితే ఈ సినిమాలో తారక్ లుగర్ లుక్ చూశాం కానీ అసలు లుక్ డ్రాగన్ వెర్షన్ ని ఇంకా చూడలేదు. అయితే దీనిపైనే క్రేజీ బజ్ వినిపిస్తుంది. దీని ప్రకారం 'డ్రాగన్' లుక్ ఈ ఏడాది డిసెంబర్ లోనే వచ్చే ఛాన్స్ ఉందట. అంటే ఇంకా 6 నెలలు ఆగాల్సిందే అని చెప్పాలి. తారక్ ఆల్రెడీ క్రేజీ లుక్ ని ఈ సినిమాకి రెడీ చేసి షాకిచ్చాడు. ఇక డ్రాగన్ లుక్ ఎలా ఉంటుందో చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు

## డబ్బులు వెనక్కిచ్చేస్తున్న జననాయగన్

విజయ్ ముఖ్యమంత్రి అయిన ఉత్సాహంలో ఆయన చివరి చిత్రాన్ని థియేటర్లలో పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేయాలని ఎదురు చూస్తున్న అభిమానుల్లో అసహనం పెరిగిపోతోంది. ఐదు నెలల ముందు సంక్రాంతి కానుకగా రిలీజ్ కావాల్సిన సినిమా జననాయగన్. కానీ సెన్సార్ సమస్యలతో అనూహ్యంగా రిలీజ్ ఆగిపోయింది. జనవరి 9న రిలీజ్ కుదరకపోయినా.. ఇంకొన్ని రోజుల్లో సినిమా థియేటర్లలోకి వచ్చేస్తుందిలే అనుకున్నారు అభిమానులు. కానీ అనూహ్యంగా ఆ చిత్రం నెలల తరబడి విడుదలకే నోచుకోకుండా ఆగిపోయింది. ఐతే గత నెలలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయంతో విజయ్ ముఖ్యమంత్రి కావడంతో ఈ చిత్రానికి అడ్డంకులన్నీ తొలగిపోయినట్లే అని భావించారు. కానీ విజయ్ సీఎం అయి నెల కావస్తున్నా 'జననాయగన్'కు మోక్షం కలగలేదు. ఇదిగో అదిగో అంటున్నారే తప్ప సినిమా బయటికి రావడం లేదు. కనీసం రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేయకపోవడం వెనుక ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు. విజయ్ ముఖ్యమంత్రి అయిన ఉత్సాహంలో ఆయన చివరి చిత్రాన్ని థియేటర్లలో పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేయాలని ఎదురు చూస్తున్న అభిమానుల్లో అసహనం పెరిగిపోతోంది. అసలు ఇప్పుడీ చిత్రాన్ని విడుదల చేయడంలో సమస్య ఏంటి అన్నది అంతుబట్టకుండా ఉంది. ఇలాంటి టైంలో ఒక లేటెస్ట్ న్యూస్ కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. 'జననాయగన్' అనుకున్న రిలీజ్ డేట్ నుంచి ఐదు నెలలు ఆలస్యం అయిన నేపథ్యంలో బయ్యర్ల అగ్రిమెంట్లన్నీ క్యాన్సిల్ చేసి, వారికి రీఫండ్ చేయబోతున్నాడట నిర్మాత నారాయణ. స్వయంగా విజయే ఈ మేరకు సూచించినట్లుగా కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. బయ్యర్ల నుంచి తీసుకున్న డబ్బులకు వడ్డీ వేసి మరీ ఇచ్చేయబోతున్నారట. తర్వాత




సినిమాకు సెన్సార్ సహా అన్ని అడ్డంకులూ తొలగిపోయాక నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్సే సొంతంగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసుకుంటుందట. సంక్రాంతికి రిలీజ్ ఆగిపోవడం, ఇంత ఆలస్యం కావడం వల్ల నిర్మాతకు దాదాపు రూ. 200 కోట్ల నష్టం వచ్చినట్లుగా చెబుతున్నారు. ఈ సినిమా ద్వారా వచ్చే ఆదాయాన్ని బట్టి చివరగా లెక్కలు చూసి, నిర్మాతకు తలెత్తే నష్టాలను విజయ్ భర్తీ చేయాలనుకుంటున్నాడని.. పారితోషకం నుంచి మినహాయించుకోవడం లేదంటే భవిష్యత్తులో కుదిరితే ఇంకో సినిమా చేయడం లాంటి సెటిల్మెంట్ జరగొచ్చని తెలుస్తోంది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555